క్లుప్తంగా

సైడు కాలువల నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న దుంపా చెంచిరెడ్డి, సర్పంచ్ నాగమణి

చీమకుర్తి: సంతనూతలపాడు పంచాయతీలో రూ.25 లక్షలతో సైడు కాలువల నిర్మాణానికి స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రోడ్డు మీద మురుగునీరు నిలబడకుండా ఉండేందుకు సైడు కాలువలు నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవెంకటేశ్వర స్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో శ్రీవెంకటేశ్వరస్వామి, భక్తులు

చీమకుర్తి: శ్రీవెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని శనివారం చీమకుర్తి పట్టణంలో వైభవంగా నిర్వహించారు. రథసప్తమి పర్వదినం సందర్భంగా స్థానిక హరిహరక్షేత్రం నుంచి శ్రీవెంకటేశ్వర స్వామిని పురవీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. గోవిందస్వాముల ఆధ్వర్యంలో రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

న్యాక్ గుర్తింపులో విద్యార్థులు స్పందించాలి

ఒంగోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం న్యాక్ గుర్తింపు సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఒంగోలు రీజనల్ కో ఆర్డినేటర్ యం.శ్రీనివాసరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులకు న్యాక్ నుంచి ఈ మెయిల్ వస్తుందని, ఆ ఈ మెయిల్‌కు తప్పక స్పందించాలన్నారు. అందులో 20 ప్రశ్నలతో కూడిన ఈమెయిల్ వస్తుందని, విద్యార్థులు కనీసం రెండు రోజులకోసారి ఈ మెయిల్స్ చూసుకోవాలన్నారు. న్యాక్ గుర్తింపు అంచనాలో భాగంగా యూనివర్సిటీ అందించే సేవలకు విద్యార్థుల నుంచి అభిప్రాయాలు తెలుసుకునేందుకు న్యాక్ ప్రశ్నావళిని ఈమెయిల్‌కు పంపుతుందన్నారు.

స్కౌట్ సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్స్ పొందిన విద్యార్థులతో సర్పంచ్, ఎంపీటీసీ, హెచ్ఎం

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్టేట్ స్కౌట్స్అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన తృతీయ సోపాన్ క్యాంపులో కరవది 8 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గ్రామ సర్పంచ్ డి.కోటేశ్వరరావు అధ్యక్షతన అతిథులుగా పాల్గొన్న ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, విద్యాకమిటీ అధ్యక్షులు చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు ఎస్.సుధారాణి పాఠశాల తరపున పాల్గొన్న 8మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల్లో మంచి ప్రావీణ్యత సాధిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తెలిపారు.

కౌన్సెలింగ్ షెడ్యూలు విడుదల చేయాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ షెడ్యూలు విడుదలచేయాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డిలు డీఈఓను కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని 150 ఎయిడెడ్ పాఠశాలల్లో 650 మంది ఉపాధ్యాయ సిబ్బంది మిగులుగా తేలినందున ఎయిడెడ్ ఉపాధ్యాయులను సీనియార్టీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు





ఊరేగింపుగా ప్రసన్న చెన్నకేశవస్వామి



శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి



సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు: రథసప్తమి వేడుకలు నగరంలో కనులపండువగా నిర్వహించారు. ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయం, శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి, దక్షిణం బజారు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల నుంచి స్వామివార్లు సప్త రథాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితుల ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం, విష్వక్సేన పూజ, కుంభారాధన నిర్వహించారు. ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథం, ఈఓ రజనీకుమారి, సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, కుర్రాప్రసాద్‌బాబు, శ్రీగిరి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, టీటీడీ ధార్మిక సలహామండలి జిల్లా పూర్వ అధ్యక్షుడు ఆలూరు వెంకట రమణారావు, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణా కార్యక్రమాలను పర్యవేక్షించారు. చెరువుకొమ్ముపాలెం సరస్వతీ విద్యాసంస్థల ఆవరణలో పతంజలి యోగా పీఠం ఆధ్వర్యంలో వందలాది మంది బాలబాలికలతో సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించారు. కాలేజీ డైరెక్టర్లు గణేష్‌రెడ్డి, గంగా శంకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శారదా పీఠం వార్షికోత్సవంలో మాజీ మంత్రి శిద్దా



స్వామి నుంచి అమ్మవారి శేషవస్త్రాలు అందుకుంటున్న శిద్దా రాఘవరావు

ఒంగోలు: విశాఖ శ్రీశారదా పీఠం వార్షికోత్సవంలో మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం రాజశ్యామల అమ్మవారికి నిర్వహించిన మహా మంగళహారతిలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. స్వరూపానందేంద్ర సరస్వతి శిద్దా రాఘవరావును ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, పీఠం జ్ఞాపికను అందించారు.

మతాలన్నీ ప్రేమనే బోధించాయి

ఒంగోలు టౌన్: ప్రపంచంలోని అన్ని మతాలు ప్రేమనే బోధించాయని, మతాల సారాన్ని అర్థం చేసుకోకుండా ప్రజలు అనవసరంగా విద్వేషాలను రెచ్చగొట్టకుంటున్నారని జైహో జాతీయ అధ్యక్షుడు విజయశంకర స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఏ సాలార్ అధ్యక్షతన శనివారం మల్లయ్యలింగం భవన్లో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల దేశంలో మత విద్వేషాలు పెరిగిపోతున్నాయని, ప్రజల మధ్య సామరస్యం దెబ్బతినడం మంచి పరిణామం కాదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే జాతి మనుగడ ప్రమాదంలో పడుతుందని చెప్పారు. దేశ ప్రజలంతా సోదరభావంతో మెలగాలని విజ్ఞప్తి చేశారు. జైభారత్ ప్రధాన కార్యదర్శి లోక్‌నాథ్, సయ్యద్ అబ్దు రహిమాన్, ఆంజనేయులు, ఎంఏ సత్తార్, జిలానీ పాల్గొన్నారు.

ఒలింపిక్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



బొడ్డు సుబ్బారావు



నూతన కార్యవర్గం

ఒంగోలు: ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొడ్డు సుబ్బారావు ఎంపికయ్యారు. స్థానిక మినీ స్టేడియంలో శనివారం జరిగిన జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక అనంతరం సుబ్బారావు ఎంపిక వివరాలను మీడియాకు విడుదల చేశారు. ఎంపిక ప్రక్రియకు పరిశీలకులుగా వేణుగోపాలరావు వ్యవహరించారు. ఎంపికైన కమిటీ 2027 వరకు కొనసాగుతుందన్నారు.

నూతన కమిటీ..

అధ్యక్షుడు- కుర్రాభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి- బొడ్డు సుబ్బారావు(బాక్సింగ్), ఉపాధ్యక్షుడు-పీఎల్ రాజు(జూడో), జి.ధనుంజయరావు(వాలీబాల్), వి.నాగేశ్వరరావు(ఫెన్సింగ్), ఎ.సుందరరామిరెడ్డి(రగ్బీ), సంయుక్త కార్యదర్శులు కె.శ్రీనివాసరావు(రెజ్లింగ్), డి.రవిప్రసాద్(సెపక్‌తక్రా), సోమినేని సురేష్ బాబు(బాస్కెట్‌బాల్), డి.రమేష్(కబడ్డీ), కోశాధికారి ఎస్.చంద్రశేఖరరావు(ఆక్వాటిక్స్), కార్యనిర్వాహక సభ్యులు ఏవీ సుబ్బారావు(జిమ్నాస్టిక్స్), బి.జగదీష్‌బాబు (మోడరన్ పెంటాథ్లాన్), పి.ఉదయరాజు(బాక్సింగ్), బి.అంకబాబు(టేబుల్ టెన్నిస్), ఎస్‌కె ఎ సలాం(తైక్వాండో), ఎ.రోజర్‌బిన్నీ(ఫుట్‌బాల్).

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయండి

● ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఎంతో వ్యయంతో లేఅవుట్లు కొనుగోలు చేసి మౌలిక సదుపాయాలు, రోడ్లు, ఇతర సౌకర్యాలకు ఎంతో ఖర్చు చేశామన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందజేశామని తెలిపారు. నిర్మాణాలు ప్రారంభించకుంటే వేరే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. డ్వాక్రా సంఘ లీడర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరవది అంబేడ్కర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గ్రామ కార్యదర్శులు, హౌసింగ్ ఏఈ పృథ్వీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎలిజిబెత్ రాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలకు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

నేడు ఒంగోలు 31వ డివిజన్‌లో గడప గడపకు..

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని 31వ డివిజన్‌లో ఆదివారం ఉదయం 7.30 గంటలకు వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఆయన కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

బీసీ కుల గణన చేయాలి

● జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొట్ల సుబ్బారావు



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొట్ల సుబ్బారావు

ఒంగోలు: బీసీ కుల గణనను కేంద్రం చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొట్ల సుబ్బారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో జన గణనలో బీసీ కులగణన అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జంతువులకు సైతం లెక్కలున్నాయని, కానీ బీసీ కులాలకు సంబంధించిన గణన లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపినందున కేంద్రం కూడా కుల గణనను చేపట్టాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహారావు మాట్లాడుతూ 2011లో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా పార్లమెంట్‌లో బీసీ కుల గణనకు అంగీకరించాయన్నారు. అయితే అప్పటికే గణనకు సంబంధించిన పత్రాలన్నీ పంపిణీ అయినందున 2021 కుల గణనలో గణించాలని నిర్ణయించారన్నారు. 2018లో కొన్ని బ్రాహ్మణ వాద సంఘాలు కోర్టులో కుల గణనకు వ్యతిరేకంగా కేసులు వేశాయని, వీటిపై అనేకమార్లు జంతర్‌మంతర్ వద్ద కూడా ధర్నా చేసినట్లు తెలిపారు. బీసీల్లో కూడా వెనుకబడిన సంచార జాతులను ఆదుకోవాలని, నేటివరకు చట్టసభల్లో ప్రాధాన్యత లేని కులాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కనుక కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ గణన జరిపి బీసీ జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అనంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తిర్లిక శ్రీనివాసులు, ఒంగోలు నగర అధ్యక్షులుగా పిగిలి శ్రీను, ఒంగోలు నియోజకవర్గ కన్వీనర్‌గా జి.వెంకటేశ్వర్లును నియమించారు. బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఎంఆర్‌పీఎస్ నాయకులు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళల్లో ప్రశ్నించేతత్వం పెరగాలి

● జేవీవీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

ఒంగోలు టౌన్: మహిళల్లో ప్రశ్నించేతత్వం పెరగాల్సిన చారిత్రక అవసరం ఉందని జేవీవీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. జేవీవీ సమతా వేదిక మహిళా విభాగం ఆధ్వర్యంలో గద్దలగుంట ఆరామ క్షేత్రంలో శనివారం నుంచి ప్రారంభమైన రెండు రోజుల జరిగే శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో అన్ని వర్గాల మహిళలు పెను సవాళ్లను ఎదుర్కోవాల్సిన అవసరం వస్తుందని, ఈ నేపథ్యంలో ధైర్యం, పట్టుదలతో నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. శిక్షణా శిబిరానికి జంపా కృష్ణమోహన్, జి.నిర్మలా రాణి, సమత,డాక్టర్ అరుణలు సంధానకర్తలుగా వ్యవహరించారు. మీనాకుమారి, కొండమ్మ, ఎల్.సుజాత, కృష్ణవేణి, శివపార్వతి, ప్రమీలా రాణి, వీణ, రామలీల పాల్గొన్నారు.

సాహిత్యంతో చైతన్యం నింపిన వ్యక్తి ఎండ్లూరి

● ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

ఒంగోలు: సాహిత్యంతో సమాజంలో చైతన్యాన్ని నింపిన వ్యక్తి ఎండ్లూరి సుధాకర్ అని ఎంఎల్‌సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో శనివారం రాత్రి జరిగిన ఎండ్లూరి సుధాకర్ ప్రథమవర్థంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సుధాకర్ రచించిన పలు కవితలు చదివి వినిపించారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, మున్నంగి లక్ష్మయ్య, కత్తి కళ్యాణ్ తదితరులు పాల్గొని సుధాకర్ అందించిన స్ఫూర్తిని అందుకొని ముందుకు సాగుదాం అని పిలుపునిచ్చారు. అనంతరం ఎండ్లూరి సుధాకర్ స్మారక అవార్డును రంగస్థల కళాకారులు అంగలకుర్తి ప్రసాద్ తదితరులకు అందించారు. కార్యక్రమాన్ని ఒంగోలు మాదిగ జన సేవా సమితి నాయకులు సీహెచ్ బాలకోటయ్య, పి.వీరాస్వామి, ఎస్.అభిషేక్‌పాల్, జి.వెంకటేశ్వర్లు నిర్వహించగా గంగవరపు విజయభాస్కర్ సభాధ్యక్షులుగా, అట్లూరి అమ్మయ్య కార్యదర్శిగా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తమ్ములూరి కిషోర్‌బాబు వ్యవహరించారు.

జాషువా సాహితీ వారసుడు ఎండూరి

ఒంగోలు టౌన్: తెలుగు సాహిత్యంలో మహాకవి గుర్రం జాషువా సాహితీ వారసత్వాన్ని కొనసాగించిన ఏకైక కవి డాక్టర్ ఎండూరి సుధాకర్ ఒక్కరేనని మహజన సోషలిస్టు పార్టీ సీనియర్ నాయకుడు జి.రవికుమార్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎంఆర్పీస్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎండూరి సుధాకర్ ప్రథమ వర్ధంతిని సందర్భంగా నివాళి అర్పించారు. సుధాకర్ కవిత్వాన్ని విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్లినప్పుడే నిజమైన నివాళి అవుతుందన్నారు. నందిగామలో ఈ నెల 31న నిర్వహించనున్న ఎమ్మెస్పి జాతీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని తోట ఆనంద్ కోరారు. జలదంకి నరసింహారావు, బి.లక్ష్మీ నరసయ్య, శ్యాం, కాశీరావు, రావినూతల కోటయ్య పాల్గొన్నారు.